క్లుప్తంగా...

ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలి



గోవింద్ రాఠీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాగనాథ్ మాశెట్టి

చార్మినార్: నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని టీఎస్ బసవ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నాగనాథ్ మాశెట్టి కోరారు. మంగళవారం రాత్రి 2025 నూతన సంవత్సరానికి ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు గోవింద్ రాఠీకి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆయనకు శాలువా కప్పి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగనాథ్ మాశెట్టి మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్రంలో పాడిపంటలు నిండుగా పండి రైతులు చల్లంగా ఉండాలన్నారు. అలాగే అన్ని రకాల వ్యాపారాలు ఆర్థిక అభివృద్ధిని సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ



క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేస్తున్న ఆదర్ల మహేశ్ తదితరులు

గౌలిపురా: మహారాష్ట్ర పల్ఘర్‌లో నిర్వహించనున్న 37వ జూనియర్, సీనియర్ టగ్-ఆఫ్-వార్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్న తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులకు మంగళవారం కిట్లను పంపిణీ చేశారు. అనంతరం క్రీడాకారులకు విజయోత్సవంతో తిరిగి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టగ్-ఆఫ్-వార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆదర్ల మహేశ్, ప్రధాన కార్యదర్శి ఎం.బ్రహ్మానందం, చీఫ్ కోచ్ కె.దేవేందర్‌తో పాటు జె.అశోక్, కె.సురేందర్, ఎ.భానుప్రకాశ్, బి.సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



చాంద్రాయణగుట్ట: శంషీర్‌గంజ్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. గతేడాది పదో తరగతి పరీక్షల్లో 14 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించడం వెనుక ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని మెహదీపట్నం జోన్ ఏజీఎం కృష్ణ, ఆర్.ఐ హరికృష్ణ, శ్రీరాంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కో ఆర్డినేటర్ ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ ఆశ, డీన్ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన బోర్డులు ఏర్పాటు



అబిడ్స్: వాహనదారులను అప్రమత్తం చేసేందుకు గోషామహల్ ట్రాఫిక్ పోలీసులు అవగాహన బోర్డులు ఏర్పాటు చేశారు. ఎంజేమార్కెట్, గోషామహల్, బేగంబజార్, ఎంజే బ్రిడ్జ్, పురానాపూల్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ ఆధ్వర్యంలో ఓ వైపు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ..మరో వైపు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మీ కుటుంబ సభ్యులు ఉన్నారన్న విషయం గుర్తించుకోవాలని పలు సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు.

కేలండర్ ఆవిష్కరణ



గన్‌ఫౌండ్రీ: 2025 నూతన కేలండర్‌ను న్యూ టైమ్స్ న్యూస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. టీఏఫ్‌సీఓ కార్యాలయంలో మంగళవారం ఈ నూతన కేలండర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ నజీబ్, సయ్యద్ ఉస్మాన్‌అలీ, హమీద్ ఖాన్, మహ్మద్ ఫహీద్, మహ్మ వహియుద్దీన్, అమీర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

గడ్డి శేఖర్‌కు మాతృవియోగం



గడ్డి కస్తూరి(ఫైల్)

లంగర్‌హౌస్: బీజేపీ సీనియర్ నాయకుడు, దక్షిణ మధ్య రైల్వే జెడ్ఆర్ఈసీసీ, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి గడ్డి చంద్రశేఖర్‌కి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి గడ్డి కస్తూరి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. మంగళవారం రాత్రి లంగర్‌హౌస్ సంగం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించగా మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, నర్సింగ్‌రావు, ఇంద్రసేనా రెడ్డి, నాగేంద్రప్రకాష్ రెడ్డి పాల్గొని ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.





రమణీయం.. రామామృత నృత్యం



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్యాలయ సంస్థ అభినేత్రి ఆర్ట్స్ అకాడమి 20వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల గోపాల చరితం, రుక్మిణీ కల్యాణం, రమామృతం వంటి వివిధ అంశాలపై సంస్థ కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..భరత నాట్యం వంటి శాస్త్రీయ కళల్లో 20 ఏళ్లుగా వందలాది మందిని తీర్చిదిద్దడం ఎంతో అభినందనీయమన్నారు. 150 మంది విద్యార్థులతో కలిసి చేసిన రామామృతం ప్రదర్శన కళ్ల నిండ అమృతం లాగ కురిసిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తానా కార్యదర్శి దేవినేని లక్ష్మి, సినీనటి అశ్రిత, సీనియర్ జర్నలిస్ట్ మా శర్మ, అభినేత్రి ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపకు డు ప్రమోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం ఎక్కువ



సౌత్ వెస్ట్ జోన్ డీసీపీకి పోలీస్ లోగో అందజేస్తున్న సీనియర్ మజ్లిస్ నాయకుడు ఎం.ఏ.జాహెద్

గోల్కొండ: దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం ఎక్కువ అని తాము అనుకున్నది సాధించే వరకు విశ్రమించరని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ అన్నారు. సీనియర్ మజ్లిస్ నాయకుడు, గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.ఏ.జాహెద్ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన తాను రూపొందించిన తెలంగాణ పోలీస్ లోగోను అందజేశారు. డీసీపీ మాట్లాడుతూ.. తాను ఇప్పటి వరకు ఎందరో దివ్యాంగులను కలుసుకున్నానని వారంతా తాము ఎంచుకున్న రంగంలో విజయవంతంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, డీఐ రాజేందర్‌కుమార్, ఎస్సై రఫీయుద్దీన్ పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా మల్లేష్



చైర్మన్, వైస్ చైర్మన్‌గా నియమితులైన తలారి మల్లేష్, కావలి చంద్రశేఖర్

అబిడ్స్: గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తలారి మల్లేష్, వైస్ చైర్మన్‌గా కావలి చంద్రశేఖర్‌తో పాటు మరో 16 మందిని సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ప్రకటించింది. డైరెక్టర్లుగా షేక్ మహ్మద్ మునీర్ అహ్మద్, కురవ పాండు, జె.లక్ష్మారెడ్డి, బండారి శంకర్, బొక్క ప్రహ్లాద్ రెడ్డి, మొహమ్మద్ అబ్దుల్ వాసీమ్, ఎ.గణేష్‌రెడ్డి, గొంగడి ఓంప్రకాష్‌రెడ్డి, ముంగి రఘుపాల్ రెడ్డి, కె.జగన్నాథ్‌రెడ్డి, ఆర్.వెంకట్‌రెడ్డితో పాటు మరో నలుగురు వివిధ శాఖల అధికారులను నియమించారు. మంగళవారం సాయంత్రం మార్కెట్ కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు మునీర్ అహ్మద్, అబ్దుల్ వాసీమ్, బండారి శంకర్, రఘుపాల్‌రెడ్డిలు బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ..రైతులు అన్ని విధాల లబ్ధి పొందే విధంగా ప్రత్యేక కృషి చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే ప్రమాణ స్వీకరణ వేడుకలు చేపడతామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, మహేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నెహ్రూబాబు సేవలు అభినందనీయం



నెహ్రూబాబును సన్మానిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

యాకుత్‌పురా: విద్యారంగంలో నెహ్రూబాబు అందించిన సేవలు అభినందనీయమని విద్యాశాఖ చార్మినార్, సైదాబాద్ మండలాల డిప్యూటీ ఈఓలు సుజాత, రాధాకృష్ణ కొనియాడారు. చార్మినార్ మండల డిప్యూటీ ఐఓఎస్ ఐ. నెహ్రూబాబు పదవీ విరమణ సందర్భంగా మంగళవారం మండల కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో వారు పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ..నెహ్రూబాబు గత 34 ఏళ్లుగా విద్యాశాఖలో వివిధ హోదాల్లో విశిష్ట సేవలందించారన్నారు. డిప్యూటీ ఐఓఎస్ వెంకట నరసరాజు, పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి, బాల భవన్ సూపరిటెండెంట్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సత్యవతి, మహ్మద్ ఇక్బాల్, అహ్మద్ ఖాన్, సయ్యద్ రహ్మతుల్లా, వజీవుద్దీన్ హమీద్, ఇబ్రహీం ఖాన్, జాహెద్ హుస్సేన్, ఇలీయస్ అహ్మద్ పాల్గొని వీడ్కోల శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి: కౌసర్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పాత నిజాం మిలట్రీ క్వాటర్స్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన కార్వాన్‌లోని పలు సమస్యలతో పాటు పాత నిజాం మిలట్రీ క్వాటర్స్, గోల్ఫ్ క్లబ్ పట్టాదారుల సమస్యలను కూడా పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. ఎండిలైన్స్‌లో నిజాం సైనికులు నివసించే పాత మిలట్రీ క్వాటర్స్‌పై ఆర్టిలరీ సెంటర్‌కు చెందిన సైనికులు తమ గుప్పిట్లో ఉంచుకున్నారని ఆయన అన్నారు. ఉదయం, సాయంత్రం క్వాటర్స్ మధ్య నుంచి మిలట్రీ వారు తుపాకులు పట్టుకొని గస్తీ చేస్తున్నారని దీన్ని వల్ల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారన్నారు. అదే విధంగా గోల్కొండ నయాఖీలాలో గోల్ఫ్ కోర్సును నిర్వహించడానికి రైతుల నుంచి భూములు తీసుకోని దానికి ఇంకా పరిహారం ఇవ్వలేదని ఆయన అన్నారు. వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

కుంభమేళాకు తరలిన లారీలు



లంగర్‌హౌస్: ప్రయాగ్‌రాజ్ కుంభమేళకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సాధు, సంతుల అఖాడా ఆధ్వర్యంలో లంగర్‌హౌస్ త్రివేణి సంగం రాంచంద్రజీ మఠ ఆలయం తరఫున కుంభమేళా నిర్వహించే అవకాశం దక్కింది. పీఠాధిపతి 1008 రాహుల్ దాస్ బాబా ఆధ్వర్యంలో కుంభమేళాలో సేవలు నిర్వహించనున్నారు. ఇందుకోసం టెంట్లు తదితర సామగ్రి తీసుకెళ్లి అక్కడ ఏర్పాట్లు ప్రారంభించారు. సోమవారం రాత్రి దేవిదేవతల మూర్తులు, ఆహార సామగ్రిని తీసుకొని దాదాపు ఆరు లారీలు ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగంకు బయల్దేరాయి. కుంభమేళాలో సంగం ఆలయం తరఫున నిత్యం పూజలు చేస్తూ దాదాపు 6 లక్షల మంది సాదుసంతులు, భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా తెలిపారు. మరి కొన్ని లారీలు జనవరి 6న, వైకుంఠ ఏకాదశి రోజున లంగర్‌హౌస్ నుంచి బయల్దేరుతాయన్నారు.

ఆర్థిక విద్రోహంపై బీజేపీ సమాధానం చెప్పాలి



గౌరీ సతీష్

అబిడ్స్: సంపన్నుల కోసం బీజేపీ ఆర్థిక విద్రోహానికి పాల్పడిందని, దీనికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..గతంలో కాకినాడ కార్యవర్గ సమావేశంలో ఒక్క ఓటుకు రెండు రాష్ట్రాలు అని చెప్పి తెలంగాణను బీజేపీ ఎందుకు ఇవ్వలేదో అని ఆయన ప్రశ్నించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని అన్నారు. అలాంటి మన్మోహన్‌సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం వెంటనే భారత రత్న ప్రకటించాలన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ప్రకటించి 140 కోట్ల ప్రజల ఆకాంక్షను తీర్చాలన్నారు. దేశంలో రైతు ఇన్ఫర్మేషన్ యాక్ట్, పనికి ఆహార పథకం తెచ్చిన ఘనత మన్మోహన్ సింగ్‌కే దక్కిందన్నారు. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం పేదరికాన్ని మరింత పెంచి పోషించిందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే పేదరిక నిర్మూలన జరుగుతుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కేంద్రంలో కాంగ్రెస్‌దే అధికారం అని రాహులు గాంధీ ప్రధాని కావడం ఖాయమని గౌరీ సతీష్ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: ఇందిరాప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) హైదరాబాద్‌లో యూజీ, పీజీ తరగతులకు ఆంగ్లం బోధించుటకు అర్హత కలిగిన ఆంగ్ల అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్ర ముఖర్జి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు జనవరి 3న ఉదయం 11 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు. పీజీలో కనీసం 55 శాతం మార్కులు (ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం) కలిగి ఉండాలని, సంబంధిత సబ్జెక్టులో నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు.

పోస్టల్ స్టాంప్ విడుదలపై హర్షం



పోస్టల్ స్టాంప్ ప్రదర్శనలో ప్రతినిధులు

చార్మినార్: సాదీలోని అల్ బకీ (రీ-బిల్ట్) పునర్నిర్మాణం కోరుతూ వందేళ్లుగా చేస్తున్న విజ్ఞప్తికి భారత ప్రభుత్వం స్పందించి దాని పేరుతో పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేయడంపై షియా ముస్లింలందరూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. అల్ బకీ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇనాయత్ జంగ్ దేవిడీలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు ఐదు రూపాయల ఖరీదు చేసే పోస్టల్ స్టాంప్‌ను మన దేశంలో విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. అల్ బకీ ఆర్గనైజేషన్ ప్రతినిధి డాక్టర్ ఇఫ్తేకార్ బదర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



హ్యూమన్‌నగర్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని హ్యూమన్‌నగర్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ అన్నారు. ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గోల్కొండ జోన్ పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు మంగళవారం ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పోలీస్ అనుసరిస్తున్న అధునాతన నేర పరిశోధన విధానంతో నేరస్తులను వెంటనే పట్టుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ఆబీద్, మహ్మద్ షానవాజ్‌ఖాన్, ఇమ్రాన్ ఆలీఖాన్, మోజంభాయ్ తదితరులున్నారు.

సివిల్ కాంట్రాక్టర్ అదృశ్యం



మహ్మద్ అబ్దుల్ రవూఫ్(ఫైల్)

చాంద్రాయణగుట్ట: సివిల్ కాంట్రాక్టర్ అదృశ్యమైన ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బీబీ కా చష్మా ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ రవూఫ్(49) జలమండలిలో సివిల్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నారు. 30న ఉదయం 11 గంటలకు బైక్‌పై బయటికి వెళ్లిన రవూఫ్ తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. అతని భార్య మస్రత్ జాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, అధికారులు

గౌలిపురా: లాల్‌దర్వాజా ఆలయం వద్ద జీహెచ్ఎంసీ ద్వారా చేపట్టిన సీసీ రోడ్డు పనులను మంగళవారం గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర సర్కిల్-7 ఈఈ ఏకాంబరంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర మాట్లాడుతూ..సీసీ రోడ్డు పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో స్థానిక దుకాణదారులు, బస్తీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పనులను ఈ నెల 2న ప్రారంభించి వారం రోజుల్లో పనులను పూర్తి రహదారిని ప్రజలకు అందుబాటులో తీసుకొస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు, ఏఈ అన్సారీ, ఏఈఈ తేజోపంత్, నాయకులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీ కేలండర్ ఆవిష్కరణ



నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నూతన సంవత్సర కేలండర్‌ను విడుదల చేశారు. మంగళవారం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు కేలండర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. 2025లో తెలుగు విశ్వవిద్యాలయం వినూత్నంగా విద్యాత్మక సంబంధిత విషయాలపై దృష్టి పెట్టనుందని, ఆచరణాత్మక కార్యక్రమాలపై ప్రణాళికలను రూపొందించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంచాలకులు డాక్టర్ పద్మప్రియ, డిప్యూటీ రిజిస్ట్రార్ జగదీష్, రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ జి.సుబ్బారావు, పంచాంగకర్త డాక్టర్ వెంకట సత్యనారాయణ, జ్యోతిష శాఖ అధ్యాపకులు, ప్రజా సంబంధాల అధికారి శ్రీనివాస్ గౌడ్, కె.ఎం.రాములు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ పాదుకా ప్రతిష్ఠ మహోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా మేకలబండలోని నల్లపోచమ్మ ఆలయంలో అమ్మవారి పాదుకా ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్న వెంకటరమణ తెలిపారు. జనవరి 22న నిర్వహించే ఈ ఉత్సవానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయంలో ఇటీవల పసుపులో అమ్మవారి కుడి కాలి పాదముద్ర దర్శనం ఇచ్చిన నేపథ్యంలో వెండి పాదుకలు ప్రతిష్ఠించాలని నిర్ణయించామన్నారు. జనవరి 22న ఉదయం 9.35 గంటలకు స్వాతి నక్షత్రయుక్త శుభలగ్న శుభాంశమునందు జగద్గురువులు ఆది శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు విద్యారణ్య భారతి స్వామి చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాపన ఉంటుందన్నారు. వర్కింగ్ చైర్మన్ సి.వెంకటేష్, వైస్ చైర్మన్లు తుడి ప్రవీణ్, వై.శ్రీహరి రాజు, ఉపాధ్యక్షులు వేద ప్రకాష్, ప్రేమ్‌కుమార్, కోశాధికారులు అనిల్‌కుమార్, మాణిక్ ప్రభు పాల్గొన్నారు.

వైభవంగా తిరుప్పావై సదస్సు



తిరుప్పావై సదస్సులో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో దరూరి రామానుజాచార్యులు అధ్యక్షతన తిరుప్పావై సదస్సులో మంగళవారం 28 మంది పండితులతో ప్రవచనాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం దేవస్థానం ప్రధాన అర్చకులు డాక్టర్ నల్లతీగల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం రామానుజాచార్యుల చేతుల మీదుగా నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్ట్ సభ్యులు పి.నారాయణ రెడ్డి, ఎస్.చంద్రశేఖర్, కార్య నిర్వాహణాధికారి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.